క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసేందుకు సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఈడీఈ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భరత్‌నగర్‌లో వాటర్ ట్యాంక్ కాలనీలో ఉదయం 12నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



మానవపాడు: ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతూ మండలంలోని చెన్నిపాడు బీసీ కాలనీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర దర్శనమిస్తోంది. నిత్యం ఈ దారిగుండా రైతులు, ప్రజలు ప్రయాణిస్తుంటారు. ప్రమాదం జరుగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యమా?



శాంతినగర్: వాగులపై ఉన్న కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేకపోతే ప్రమాదమని తెలిసినా అధికారులకు పట్టడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నె, వడ్డేపల్లి రోడ్డు, జూలెకల్ కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. కల్వర్టుల వద్ద గుంతలు పడటం, ఇరు వైపుల రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జూలెకల్ కల్వర్టు వద్ద ఇద్దరు వ్యక్తులు గతంలో మృతి చెందారు. ఈ విషయమై అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద రక్షణ గోడలతో పాటు మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై స్పందించని అధికారులు



శాంతినగర్: గ్రామంలోని చెత్తాచెదారం కాల్వల్లో పేరుకుపోతే ప్రజలే చూసుకోవాల్సి వస్తోందని జూలెకల్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా గ్రామంలోని డ్రెయినేజీ కాల్వను శుభ్రం చేయకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారంతో నిండిపోయాయని, మురుగు నీరు నిలిచి కంపు కొడుతుండటంతో భరించలేక ఎవరి ఇళ్ల ముందు వారే కాల్వల్లో చెత్తాచెదారం ఎత్తి పోయాల్సి వస్తోందని వాపోతున్నారు. నెలరోజులుగా చెత్త ట్రాక్టర్ రాకపోవడంతో గ్రామంలోని చెత్త ఎక్కడిదక్కడే ఉంటూ అపరిశుభ్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగు నీరు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారాయని, రోగాల బారిన పడుతున్నామని గ్రామ స్తులు చెబుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరి, ప్రత్యేకాధికారి స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా పంచాయతీ ట్రై సైకిల్



మానవపాడు: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం కోసం ఉపయోగించే ట్రాక్టర్‌ను నిలిపేశారు. గ్రామాల్లో పొడి చెత్త, తడి చెత్తను ట్రై సైకిల్ ద్వారా పారిశుద్ధ్య కార్మికుల తొలగిస్తున్నారు. మండలంలోని కొర్విపాడులో రెండు ట్రై సైకిళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ట్రై సైకిల్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చి పారిశుద్ధ్య నిర్వహణకు కార్యదర్శి, ప్రత్యేక అధికారులు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో పచ్చదనం.. ఆహ్లాదం

- మొక్కలతో కళకళలాడుతున్న పల్లె ప్రకృతి వనాలు
- పట్టణాల్లో పార్కులకు దీటుగా పల్లెల్లో ఏర్పాటు
- దాతల సహకారంతో మరిన్ని వసతులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం పట్టణాలలోని పార్కులకు దీటుగా పల్లెల్లో సైతం పల్లె ప్రకృతి వనాల పేరుతో మినీ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ నిధులు, దాతల సహకారంతో పల్లె ప్రకృతి వనాలు గ్రామాల్లో ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రకృతి వనాలు వివిధ రకాల పూల, పండ్ల మొక్కలతో పాటు అందమైన మొక్కలతో కళకళలాడుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో 124 పంచాయతీలు ఉండగా, దాదాపు 118 జీపీల్లో పనులు మొత్తం పూర్తి అయ్యాయి. మిగిలిన జీపీల్లో పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను బట్టి రూ.2లక్షల నుంచి రూ.6లక్షల వ్యయంతో ఎకర, అర ఎకర, పది గుంటల స్థలంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకర స్థలంలో 4వేల మొక్కలు పెంచుతున్నారు. అందులో టేకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలతో పాటు 40 రకాల చిన్న, పెద్ద రకం మొక్కలను నాటి పెంచుతున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో చుట్టూ ఇనుప కంచె ఫినిషింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలకు నిత్యం పంచాయతీ వనమాలి ద్వారా నీటిని అందిస్తున్నారు. దీంతో ఆయా జీపీలలో మొక్కలు ఇప్పటికే ఏపుగా పెరగడంతో ప్రకృతి వనాలు పచ్చదనంతో పల్లెలు పులకరించేలా అందంగా, ఆహ్లాదకరంగా కనబడుతున్నాయి. పార్కులో ఉదయం సాయంత్రం వేళల్లో యువకుల, వృద్ధులు సేద తీరేందుకు వీలుగా దాతల సహకారంతో పలు వసతులు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం ప్రకృతి వనాలకు వెళ్లడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు నూతన ఉత్సాహం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని హంగులతో..

ప్రకృతి వనాల్లో గ్రామస్తులు సేదతీరడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లలు ఆటలు ఆడేందుకు క్రీడా సామగ్రిని దాతల సహకారంతో సమకూర్చుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో గ్రామస్తులు వాకింగ్ చేసేందుకు అందమైన రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ ప్రహరీలు ప్రజలను ఆకట్టుకునేలా రంగులతో పెయింటింగ్స్ వేశారు. ప్రకృతి వనాలలో పనులను స్థానిక, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పార్కులను ప్రభుత్వ నిధులతో పాటు దాతలు సహకారంతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణాలకు దీటుగా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోదండాపురంలో పల్లె ప్రకృతివనం



గోపల్‌దిన్నె ప్రకృతివనంలో రోడ్లు



ప్రకృతివనంలో వివిధ రకాల మొక్కలు

మండలాల వారీగా పల్లె ప్రకృతి వనాలు

మండలం	పంచాయతీలు	పూర్తయినవి
ఇటిక్యాల	29	29
మానవపాడు	16	16
ఉండవెల్లి	16	16
అలంపూర్	14	14
రాజోళి	11	11
వడ్డేపల్లి	10	10
అయిజ	28	28

40 రకాల మొక్కలు నాటాం..



మా గ్రామ పంచాయతీలో ఎకర ప్రభుత్వ స్థలంలో పల్లె ప్రకృతి వనం ఎంతో అపురూపంగా ఏర్పాటు చేశాం. అందులో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 40 రకాల మొక్కలు నాటి పెంచుతున్నా. పంచాయతీ నిధుల నుంచి ప్రకృతి వనం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి జీపీ సిబ్బంది ద్వారా నిత్యం మొక్కలకు నీటిని అందిస్తున్నాం. ప్రభుత్వం మారుమూల ప్రాంతాలలో కూడా గ్రామీణ పార్కులను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం. దాతలు ముందుకొస్తే చిన్నారులు, వృద్ధుల కోసం మరిన్ని అదనపు వసతులు కల్పిస్తా.

– రాజేశ్వరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కోదండాపురం

జీపీల్లో వనాలు నిర్మించాం..



మండలంలోని 29 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు నిర్మించాం. ఎకర స్థలంలో నాలుగు వేల మొక్కల చొప్పున సుమారు 40 రకాల మొక్కలను నాటి సంరక్షిస్తున్నాం. మూడేళ్ల వరకు మొక్కలకు నీరు అందించేందుకు ప్రతి వనానికి వనమాలిని ఏర్పాటు చేశాం. ప్రకృతి వనాల్లో అక్కడక్కడ చిన్నచిన్న పనులుండగా, త్వరలోనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇవి అందుబాటులోకి వస్తే గ్రామస్తులకు పార్కులు లేని లోటు తీరుతుంది.

– భాస్కర్, మండల పంచాయతీ అధికారి, ఇటిక్యాల

పల్స్ పోలియో విజయవంతం



అలంపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ



తాటికుంటలో..



బల్గెరలో..



ఆర్టీసీ బస్టాండ్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి



శాంతినగర్‌లో..

అలంపూర్: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం తమ పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయించుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ మనోరమ పిలుపునిచ్చారు. అలంపూర్ మున్సిపాలిటీలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, హరిజనవాడ, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కల మందు వేయడం జరిగింది. మేరుగైన సమాజ కోసం ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పల్స్‌పోలియో చుక్కల మందు తప్పక వేయించాలన్నారు. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు పల్స్‌పోలియో చుక్కల మందుత వేయించాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రేష్మాభాను, ఏఎన్ఎం శ్యామల, హెల్త్ అసిస్టెంట్ బాలీశ్వర్ శెట్టి, అంగన్‌వాడీ టీచర్లు భారతి, పుష్పలత, ఏమేలమ్మ, రూప, మాధవి, వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు చిట్టెమ్మ, నాగేశ్వరమ్మ, పద్మ, ప్రమీల ఉన్నారు.

మల్దకల్: 0–5ఏళ్లలోపు చిన్నారులకు పోలియోచుక్కలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. మండలంలోని తాటికుంట, పెద్దపల్లి, పాల్వాయి, ఎల్కూరు, మల్దకల్, నాగర్‌దొడ్డి గ్రామాల్లో పల్స్‌పోలియో చుక్కల కేంద్రాలను డాక్టర్ పరిశీలించి చిన్నారులకు చుక్కల మందు వేశారు.కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గట్టు: పల్స్ పోలియో కార్యక్రమంలో బల్గెరలో జెడ్పీటీసీ బాసు శ్యామల చిన్నారులకు చుక్కల మందు వేశారు. గట్టు గ్రామ పంచాయతీ దగ్గర చుక్కల వైద్య సిబ్బంది చిన్నారులకు వేశారు. మండలం మొత్తం 57 కేంద్రాలను ఏర్పాటు చేసి, చుక్కల మందును వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.



పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే

ఉండవెల్లి: మండలంలోని మానవపాడు పీహెచ్‌సీ, ఉండవెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పుల్లూరులోని ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు ఎమ్మెల్యే విజేయుడు పల్స్ పోలియో చుక్కలు వేశారు. మండల కేంద్రంలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి ఇర్షాద్ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు. పంట పొలాల్లో క్యాతూర్ పీహెచ్‌సీ వారు పల్స్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చంద్రన్న, మెడికల్ ఆఫీసర్ ప్రసన్న రాణి, లక్ష్మీనారాయణ, ఏఎస్ఎంలు వినోదిని, కృష్ణవేణి, ఎమ్ఎల్‌హెచ్‌పీ సంధ్య పాల్గొన్నారు.

వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కేంద్రాలను పరిశీలించారు.

రాజోళి: మండల కేంద్రంలో పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేశారు. గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, వైద్య ఉప కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

శాంతినగర్: చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ షబ్బీర్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని గ్రామాలు, మున్సిపాలిటీలోని పది వార్డుల్లో చిన్నారులకు చుక్కలు వేశారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హేమ మానస ఆధ్వర్యంలో మొత్తం 60 పోలియో కేంద్రాలను ఏర్పా టు చేశారు. మొబైల్ టీంను, ట్రాన్సిట్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి, మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ధరూరు: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో నిర్దేశించిన సెంటర్లలో చుక్కల మందు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సూపర్‌వైజర్ ఏరియా నాయక్ తెలిపారు. మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులు 7488 మంది ఉండగా, అందులో 7219 మంది చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఆదివారం 96.40 శాతం చుక్కలు మందు వేసినట్లు అధికారులు తెలిపారు.

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం డాక్టర్ రిజ్వానా తాన్వీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు 4779 మందికి గానూ ఆదివారం 4604 మందికి పల్స్ పోలియో చుక్కలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో 138 మంది సిబ్బంది పల్స్ పోలియోలో ఉన్నట్లు తెలిపారు.

కేటీదొడ్డి: తల్లిదండ్రులు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని హెల్త్‌సూపర్ వైజర్ మాక్‌సూబ్ అన్నారు. మండల కేంద్రం, గ్రామాల్లో చిన్నారులకు అంగన్‌వాడీ, పంచా యతీ కార్యాలయంలో పోలియో చుక్కలు వేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. బీచుపల్లిలో ఏర్పాటు చేసిన పోలియో కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి డాక్టర్ ఇర్షాద్ సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



మాల్దొడ్డిలో..



అయిజలో..

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కబడ్డీ పోటీల్లో విజేతలు

అయిజ: మండల కేంద్రంలో తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్న ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. అలంపూర్ ఎమ్మెల్యే క్రీడలను తిలకించి, క్రీడాకారులను పరిచయం చే సుకున్నారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేసి క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఎమ్మెల్యే సూచించా రు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బహుమతుల ప్రదానం

మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించిన ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌లో విజేతలను ఆలయ కమిటీ ప్రకటించింది. కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన జట్టు మొదటి బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకుంది. కర్నూలు జిల్లా స్టేడియం టీం 2వ బహుమతి రూ.20 వేలు, జోగుళాంబ గద్వాల జిల్లా తనగలకు చెందిన టీం 3వ బహుమతి రూ.10 వేలు, జోగుళాంబ గద్వాల జిల్లా పులికల్‌కు చెందిన టీం 4వ బహుమతి రూ.5 వేలు గెలుచుకుంది. విజేతలకు బహుమతులు అందజేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయుడు

శ్రీశైలం యాత్రికులకు సేవలు



శ్రీశైల క్షేత్రానికి బయలు దేరిన భైరంపల్లి గ్రామస్తులు

అలంపూర్: శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రను వెళ్తున్న శివస్వాములకు, యాత్రికులకు సేవలందిస్తున్నారు. అలంపూర్ పట్టణంలో శ్రీశైలం మహాక్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములకు, భక్తులకు, యాత్రికులకు యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్వర్యంలో ఉచిత సేవలను అందిస్తున్నారు. మహాశివరాత్రికి భారీ ఎత్తున భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. దీంతో మూడు ప్రత్యేక టెంట్ వేసి మెడికల్ క్యాంపు, మజ్జిగ, మంచినీళ్లు వంటి సదుపాయాలు కల్పించి శివస్వాములకు, భక్తులకు సేవందిస్తున్నారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరి లక్ష్మేందర్‌రెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయుడు, పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు శివనాయుడు, సురేష్, రంజిత్, శంకర్‌గౌడ్ ఉన్నారు.

భైరంపల్లి నుంచి..

అలంపూర్ రూరల్: భైరంపల్లికి చెందిన కొందరు భక్తులు ఆదివారం శ్రీశైలానికి పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో సాయికుమార్, విశ్వనాథం, కృష్ణ, ప్రతాప్, శివమ్మ, రమేష్‌నాయుడు, శేషమ్మ, నర్సమ్మ ఉన్నారు.



అలంపూర్‌లో శివస్వాములకు సేవలు

భక్తులకు అన్నదానం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శివ మాలదారులు, శ్రీశైలానికి వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

గట్టు: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తరుణంలో ఆదివారం మండల కేంద్రంలోని చర్చిలో సన్మానించారు. బంగారు బొజ్జయ్య(విద్యుత్ శాఖ లైన్‌మెన్), వజ్రమ్మ దంపతుల కుమారులు రాజు(ఫైర్ కానిస్టేబుల్), తేజ కుమార్(టీజీటీ సోషల్), కోడలు అభిగ్న(టీజీటీ) ఉద్యోగాలు సాధించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఉద్యోగాలు సాధించిన వారిని ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ డెవిడ్, నాయకులు నర్సింహ, తిరుమలేష్, తిమ్మప్ప, ఆనంద్, వీరేష్, నర్సింహులు, డానియేలు, హనుమంతు, మోష, స్వామి దాసు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వీఆర్ కాలనీకి చెందిన బాలరాజు గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగంలో టీజీటీకి ఎంపిక కావడంతో అతన్ని నాయకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాగరాజు, మద్దిలేటి, బాలరాజు, గౌండ బాలరాజు, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, పరమేష్, సత్యాలు, పాండు పాల్గొన్నారు.



గట్టులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న నాయకులు



ఉండవెల్లిలో ఉద్యోగం సాధించిన బాలరాజును సన్మానిస్తున్న నాయకులు

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి అన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమాన్ని లాఠీలతో అణిచివేస్తూ, ఇద్దరు రైతుల మరణానికి కారణమైందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. పార్లమెంట్‌లో కనీస మద్దతు ధర చట్టాన్ని ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందక రైతుల పంటలు ఎండు ముఖం పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. పంటలు ఎండిన రైతులకు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో జంబులయ్య, భీమయ్య, శివుడు, సాయిలు, శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.